PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 358 పేజీలు - 08 శనివారం 21 నవంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

### మతం, కులం పేరుతో

# బీజేపీ రాజకీయాలు!

● ఓట్ల కోసమే ప్రజల మధ్య విభజనలకు ప్రయత్నం ● అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్..
దక్షిణాది ప్రయోజనాలకు డీలిమిటేషన్ ప్రమాదకరమని ఆందోళన



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 : ఓట్ల కోసం బీజేపీ కుల, మత రాజకీయాలకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హిందూ, ముస్లింల ఓట్ల కోసం ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారి మధ్య పెద్దగా పోటీ లేదని వ్యాఖ్యానించారు. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే అమిత్‌షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓవైసీని ఓడించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్‌లో శుక్రవారం జరిగిన 'ఏబీపీ న్యూస్ సదరన్ రైజింగ్ సమ్మిట్-2026'లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ, మిగతా2లో...

### నాగరికతల అనుసంధానానికి

# సాంకేతికతే వారధి

● ఎస్‌సీఓ దేశాల మధ్య సాంస్కృతిక సహకారానికి ప్రధాని మోడీ పిలుపు
● తొలి నాగరికతా సంభాషణల వేదిక ప్రారంభం.. వారసత్వ సంపదనుద
భవిష్యత్ తరాలకు అందించడంలో సాంకేతికత కీలకం



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 20: ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, నాగరికతల మధ్య పరస్పర అవగాహన పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతా సంభాషణల వేదికను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యం, భద్రతకే పరిమితం కాకూడదని, సాంస్కృతిక అనుబంధానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేల ఏండ్ల మిగతా2లో...

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

● 400 డ్రోన్లు, 100 క్షిపణులతో విరుచుకుపడిన రష్యా సేనలు ● 8 మంది మృతి.. 28 మందికి గాయాలు.. కీవ్‌లో మూడు వంతెనలు ధ్వంసం



తొలి అక్షరం/కీవ్,నవంబర్ 20: అమెరికా, చైనా దేశాధినేతలతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్రైపాక్షిక చర్చలు జరిపిన కొద్ది గంటల్లోనే ఉక్రెయిన్‌పై రష్యా సేనలు భారీ దాడులకు పాల్పడ్డాయి. శుక్రవారం మిగతా2లో...

### సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే

# తేల్చుకుందాం!

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్సే
299:512 నిష్పత్తికి అంగీకరించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా..
నిరూపించలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా?



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 : సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి తనపై పోటీ చేయాలని, ప్రజల ముందే ఎవరి సత్తా ఏమిటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట మిగతా2లో...

### విద్యారంగానికి దిక్సూచి..

# చుక్కా రామయ్య

● 101వ జన్మదిన వేడుకల్లో ఘనంగా సత్కారం..
విద్యా సేవలను కొనియాడిన ప్రముఖులు




### కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు

# ఇచ్చేవాళ్లం

● మా రాష్ట్రంలో తాగడానికి కూడా నీళ్లు లేవు
● కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 : కావేరి జలాల వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలో సరిపడా నీటి నిల్వలు ఉంటే తప్పకుండా తమిళనాడుకు నీటిని విడుదల చేసేవారమని తెలిపారు. అయితే ప్రస్తుతం కర్ణాటకలో తాగునీటికి కూడా కొరత ఉందని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు.కావేరి జలాల విడుదల కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. కర్ణాటక రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని, పరిస్థితి తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది కావేరి నదికి సంప్రదాయంగా నిర్వహించే 'బాగిన' పూజను కూడా చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.11 టీఎంసీల నీటి కోసం పిటిషన్లు కర్ణాటక నుంచి మిగతా2లో...




### భూముల ఆ సర్వేకు

# మార్గదర్శకాలు

రైతులకు నాలుగు రోజుల ముందే నోటీసులు
ఆరు దశల్లో సర్వే ప్రక్రియ.. అభ్యంతరాల పరిష్కారం తర్వాతే తుది రికార్డులు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 : రాష్ట్రంలో భూముల రీ సర్వే నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సర్వే ప్రక్రియలో అధికారులు పాటించాల్సిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ విడుదల చేశారు. గ్రామాల వారీగా భూముల కొలతలు, రికార్డుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, తుది రికార్డుల ఖరారు కోసం ఆరు దశల విధానాన్ని రూపొందించారు.రీ సర్వేకు నాలుగు రోజుల ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని, రెండు రోజుల ముందుగా పట్టాదారులకు గుర్తింపు జెండాలు అందించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే కొలిచిన భూమి విస్తీర్ణాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. పహాణీలో మిగతా2లో...

### ఏఐ కేంద్రంగా

# హైదరాబాద్

● ఐరాస వేదికపై
మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 : కృత్రిమ మేధ (ఏఐ), పరిశోధనా రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐక్యరాజ్యసమితి వేదికగా జరిగిన 'గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్'లో ఆయన ప్రసంగించారు. తెలంగాణను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఐటీ, ఏఐ, జీవశాస్త్ర రంగాల్లో తెలంగాణకు విస్తృత అవకాశాలున్నాయని మంత్రి వివరించారు. వైద్యం, విద్య, పర్యావరణ రంగాల్లో ఏఐ వినియోగంతో సమూల మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మిగతా2లో...

# మతం, కులం పేరుతో బీజేపీ రాజకీయాలు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ జాతి, మతం, భాష పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం మతపరమైన అంశాలను ముందుకు తెస్తోందని విమర్శించారు. **దక్షిణాదికి డీలిమిటేషన్ ముప్పు** కేంద్ర ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న నియోజకవర్గాల పునర్విభజన దేశంలోని దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తుకు పెను సవాల్‌గా మారుతుందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచితే ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు దక్కి, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది ప్రాధాన్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. మొత్తం 850 సీట్లలో ఉత్తరాదికి 650, దక్షిణాదికి 195 స్థానాలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం కేరళలో 20, ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, 50 శాతం పెంపు తర్వాత కేరళలో 30, యూపీలో 120 స్థానాలు అవుతాయని తెలిపారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య సీట్ల వ్యత్యాసం 60 నుంచి 90కి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. జనాభా, జీడీపీ ఆధారంగా '50 శాతం ఫార్ములా' అమలు చేయాలని సూచించారు. **543 స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్లు** మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త చట్టాలు, రాజ్యాంగ సవరణలు అవసరం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని సూచించారు. మహిళలకు నిజంగా ప్రాతినిధ్యం కల్పించాలనే చిత్తశుద్ధి కేంద్రానికి ఉంటే వెంటనే అమలు చేయాలని కోరారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కాంగ్రెస్ సహకరించిందని గుర్తుచేశారు. **తెలంగాణలో బీజేపీకి ఉనికి లేదు** తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా పెద్దగా ఉనికి లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తమకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తానని, కేటీఆర్‌ను మాత్రం సీరియస్‌గా తీసుకోనని అన్నారు. కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడిగా అభివర్ణించారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలల్లో జీవిస్తున్నారని విమర్శించారు. **మోడీ పాలనపై విమర్శలు** ప్రధాని మోడీని 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్'గా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి, ఆయన విదేశీ పర్యటనలపై విమర్శలు చేశారు. సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మోడీ 12 ఏండ్ల పాలనలో రూ.120 లక్షల కోట్ల అప్పులు చేశారని, గత ప్రధానులందరి పాలనలో కలిపి అప్పులు సుమారు రూ.53 లక్షల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. దేశంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, విద్యాసంస్థల నిర్మాణంలో గత ప్రధానుల పాత్రను ప్రస్తావించారు.అదానీకి ప్రజల సొమ్మును మోడీ ప్రభుత్వం మళ్లిస్తోందని ఆరోపించిన సీఎం, తెలంగాణలో మాత్రం పెట్టుబడుల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్‌గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. యువతలో మార్పు వస్తోందని, మోడీ పాలనపై ఉన్న భయాన్ని 12 రోజుల్లోనే జెన్‌జీ యువత తొలగించిందని వ్యాఖ్యానించారు.

# సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే తేల్చుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

సభలో అభివృద్ధి, ప్రజా సమస్యలు, నిధుల గురించి మాట్లాడకుండా బీఆర్ఎస్ నేతలపై విమర్శలు, వ్యక్తిగత దూషణలకే సీఎం ఎక్కువ సమయం కేటాయించారని ఆరోపించారు.రాష్ట్రంలో మూడేండ్ల కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, సాగునీటిని సక్రమంగా వినియోగించుకోకుండా తెలంగాణను కరువు పరిస్థితుల్లోకి నెట్టిందని ఆరోపించారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై రుద్దిన కరువని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అనిరుధ్‌రెడ్డి కమీషన్ల వ్యవహారాన్ని ప్రస్తావించగా, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాలన సరిగా లేదని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు.

# దేశవ్యాప్త బీసీ కులగణనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.. బీసీలకు సామాజిక న్యాయం జరగాలి: కేటీఆర్**



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 :** దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కులగణన చేపట్టాలన్న డిమాండ్‌కు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలంటే సమగ్ర కులగణన అవసరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.ఈ మేరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్.. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం చేపట్టే కులగణనకు బీఆర్ఎస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు.కులగణన ద్వారా దేశంలోని బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్యా, ఉద్యోగ రంగాల్లో వారి ప్రాతినిధ్యంపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ఇది కీలకమని అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా లెక్కలతో సరిపెట్టకుండా, ఆ వివరాల ఆధారంగా బీసీల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.గతంలోనే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశంపై చొరవ తీసుకుందని వివరించారు. అలాగే, బీసీల సమస్యలు, రిజర్వేషన్ల అంశాన్ని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్‌లోనూ ప్రస్తావించారని తెలిపారు. బీసీలకు న్యాయమైన వాటా దక్కాలంటే కులగణనతో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుపై కూడా కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన కోసం విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు చేస్తున్న ప్రయత్నాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ప్రపంచ శాంతికి కట్టుబడి ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పుతిన్ ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన తర్వాత ఈ దాడులు జరగడం గమనార్హం. ఎనిమిది గంటలకు పైగా కొనసాగిన దాడుల్లో ఎనిమిది మంది మరణించగా, 28 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. **400 డ్రోన్లు.. 100 క్షిపణులు**రష్యా సేనలు సుమారు 400 డ్రోన్లు, కనీసం 100 క్షిపణులను ప్రయోగించాయని ఉక్రెయిన్ ఆరోపించింది. వీటిలో 120 జెట్ ఆధారిత డ్రోన్లు ఉన్నాయని తెలిపింది. రష్యా దాడులతో రాజధాని కీవ్ తీవ్రంగా దెబ్బతింది. నగరంలో పేలుళ్ల శబ్దాలు వినిపించగా, దట్టమైన పొగలు అలుముకున్నాయి. మూడు వంతెనలు ధ్వంసమవడంతో రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. **పోలాండ్ గగనతలంలోకి రష్యా డ్రోన్లు** దాడుల సమయంలో రష్యా దళాలు పోలాండ్ గగనతలాన్ని ఉల్లంఘించాయని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. తమ భూభాగంలో కొన్ని వస్తువులు పడటంతో యుద్ధ విమానాలను రంగంలోకి దించడంతోపాటు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేసినట్టు వెల్లడించింది. **జనావాసాలపైనా దాడులు** ఉక్రెయిన్ సైనిక, ఇంధన కేంద్రాలు, ఓడరేవులు, రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేసినట్టు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అయితే ఖార్కివ్‌లోని ఆస్పత్రితోపాటు పలు ప్రాంతాల్లో నివాస భవనాలపైనా దాడులు జరిగాయని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువకు పడిపోతున్న సమయంలో దాడుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

# కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర

**- 23న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక.. రాష్ట్ర నేతలతో కలిసి రెండు కిలోమీటర్ల మేర యాత్ర**



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 :** కరీంనగర్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొననున్నారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నాయకత్వం పర్యవేక్షిస్తోంది.ఈ నెల 23న ఉదయం 11 గంటలకు నితిన్ నబీన్ హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం కరీంనగర్ వైశ్య భవన్‌కు వెళ్లి మహా పాదయాత్రలో పాల్గొంటారు. వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్డు మీదుగా కమాన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొననున్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. **ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు వివరణ** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో రాజ్యాంగ సంస్థలపై ఇండియా కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ఈ ప్రక్రియకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించడమే పాదయాత్ర ఉద్దేశమని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.

# నాగరికతల అనుసంధానానికి సాంకేతికతే వారధి

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర కలిగిన భారతీయ నాగరికత ప్రపంచానికి ఎన్నో విలువలను అందించిందని పేర్కొన్నారు. దేశంలోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, పురావస్తు కేంద్రాల్లో భద్రపరిచిన అపారమైన వారసత్వ సంపదను ఆధునిక సాంకేతికత సాయంతో ప్రపంచానికి పరిచయం చేయవచ్చని తెలిపారు.డిజిటల్ వేదికలు వివిధ దేశాల ప్రజలను, సంస్కృతులను దగ్గర చేస్తున్నాయని చెప్పారు. ఎస్సీఓ సభ్య దేశాల మధ్య భద్రత, ఆర్థిక వ్యవస్థ, అనుసంధాన రంగాల్లో సహకారంతోపాటు నాగరికతల పరస్పర మార్పిడికి కూడా అవకాశాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి చరిత్ర, సంప్రదాయాలు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని వివరించారు.మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో పాకిస్తాన్ సహా పలు ఎస్సీఓ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నాగరికతల మధ్య సంభాషణలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

# విద్యారంగానికి దిక్సూచి.. చుక్కా రామయ్య

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 :** ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య 101వ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూపొందించిన 'మన చుక్కా రామయ్య.. వందేళ్ల పండుగ' పుస్తకాన్ని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి పలువురు రాజకీయ, విద్యా, సామాజిక రంగాల ప్రముఖులు హాజరై రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చుక్కా రామయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేశారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు ఎంతో విలువైనవని, ఐఐటీ విద్యను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణలో ఆయనకు సమకాలీకులు లేరని పేర్కొన్నారు.జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. చుక్కా రామయ్య రాజ్యాంగ విలువలకు ప్రతీకగా నిలిచారని ప్రశంసించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్, కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా సమాజ మార్పునకు మార్గంగా భావించిన రామయ్య సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.వందేళ్లు దాటిన వయసులోనూ విద్య, సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, నాణ్యమైన విద్య అందరికీ చేరాలనే లక్ష్యంతో ఆయన సాగించిన ప్రయాణం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు ఇచ్చేవాళ్లం

(మొదటి పేజీ తరువాయి)

11 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయాలని ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆ రెండు పిటిషన్లను తోసిపుచ్చింది. అదనపు పత్రాలను సమర్పించేందుకు తమిళనాడు దాఖలు చేసిన మరో దరఖాస్తును కూడా కొట్టివేయనున్నట్టు ధర్మాసనం సూచించింది.కావేరి జలాలు, మేకెదాటు ప్రాజెక్టుపై తమిళనాడు కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడతానని డీకే శివకుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, వాస్తవ పరిస్థితులను పార్టీ నాయకులకు వివరిస్తానని పేర్కొన్నారు.

# ఏఐ కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలుస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడులకు తెలంగాణలో అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

# భూముల లీ సర్వేకు మార్గదర్శకాలు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయి కొలతలకు తేడాలుంటే వాటి కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.భూ వివాదాల పరిష్కారానికి తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి శిబిరాలు నిర్వహించాలి. శిబిరాల అనంతరం మూడు, నాలుగు రోజుల్లో కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామ పెద్దలు, బాధిత రైతులు, పక్క భూముల యజమానులతో చర్చించి వివాదాలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉమ్మడి భూముల విభజనకు పరస్పర అంగీకారం, చట్టబద్ధత ఉంటేనే అనుమతించాలని స్పష్టం చేశారు.అభ్యంతరాలు, అప్పీళ్ల విచారణ సమయంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయాలని సూచించారు. అన్ని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆ తర్వాతే భూభారతి రికార్డుల్లో సవరణలు చేపట్టాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# బాలల ప్రతిభకు బాలోత్సవం వేదిక

- **మార్కులు, ర్యాంకులకే విద్య పరిమితం కాకూడదు**
- **బాలోత్సవ నిర్వహణకు రూ.25 లక్షలు మంజూరు చేసిన మంత్రి జూపల్లి**




**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 20 :** పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విద్యను కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో కళలు, క్రీడలు, సృజనాత్మకతను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీ రమణాచారి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ బాలల ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలోత్సవ నిర్వహణతోపాటు కళల అభివృద్ధికి సాంస్కృతిక శాఖ తరఫున రూ.25 లక్షలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను అక్షరాస్యులుగా మార్చడంతోపాటు సమాజంలోని సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్య, వైద్యం వ్యాపారంగా మారడం ఆందోళనకరమని, కార్పొరేట్ విద్యా విధానం వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పిల్లల్లోని ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు.రెండు రోజులపాటు జరిగే ఆరో తెలంగాణ బాలోత్సవంలో 25 విభాగాల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, చొక్కాపు వెంకటరమణ, బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# శివస్వాములకు అన్నదానం... సేవా కార్యక్రమంలో ముందున్న ఎరుకల సంధ్య రాందాస్ గౌడ్

- కార్తీకమాసంలో శివమాలధారులకు అన్నప్రసాద వితరణ
- భక్తితో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఎరుకల సంధ్యా రాందాస్ గౌడ్







**తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 20:** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో గల గోల శ్రీ మోక్ష లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా శివమాల స్వీకరించిన శివస్వాములకు ఎరుకల సంధ్య రాందాస్ గౌడ్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో శివస్వాములకు అన్నప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా ఎరుకల సంధ్య రాందాస్ గౌడ్ మాట్లాడుతూ.. శివమాల ధరించి భక్తితో దీక్ష చేపట్టిన శివస్వాములకు అన్నదానం చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆ పరమశివుడే తనకు ఈ పవిత్రమైన సేవ చేసే అవకాశాన్ని కల్పించారని పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో గొప్ప సేవ అని, ముఖ్యంగా కార్తీకమాసంలో శివస్వాములకు అన్నదానం చేయడం ఆధ్యాత్మికంగా ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.భగవంతుడి ఆశీస్సులతో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానని ఎరుకల సంధ్యా రాందాస్ గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి ఆదిమూలం శంకర్, వీరమల్ల దాసు గౌడ్, గోగులోతు శంకర్ నాయక్, పోయిని నరసింహ యాదవ్, దోర్నాల గజేందర్, ముప్పిడి కృష్ణ, నరసింహ ఎల్ఐసి, కందగట్ల శ్రీను, పున్న శివ, భీమన గోని బాల శివ తదితరులు పాల్గొన్నారు

# పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా

- ఇందిరమ్మ పథకంతో ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే మురళి నాయక్



**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 20 (తొలి అక్షరం):** అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అన్నారు. కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, అర్హతలను ప్రజలకు వివరించారు.ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ఆపద ఎదురైతే బీమా మొత్తం ఆర్థిక భరోసాగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పథకం ప్రయోజనం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ మధుసూదన్, ఎంపీవో, తహసీల్దార్ వివేక్, సర్పంచ్ కంకల లక్ష్మి, అంబటి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకల్లో పాల్గొన్న రామన్నపేట మండల బిఆర్ఎస్ నాయకులు



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 20:** రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన జల్లెల్ల మత్స్యగిరి వివాహము చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వివిఆర్ గార్డెన్ లో జరగగా అట్టి వివాహమునకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు పోషబోయిన మల్లేశం నాయకులు ఆవుల నరేందర్ జెట్టి శివప్రసాద్ మోటి నరేష్ ఆవుల శ్రీధర్ చిన్నపాక రమేష్ నల్ల సైదులు సుర్వి రమేష్ కొండగడప చింటూ జడల శాంతి ఎర్రబోయిన వెంకటేష్ ముత్యాల నవీన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రాజగోపాల్‌రెడ్డిపై వ్యాఖ్యలు ఖండించిన దైద

- పున్న కైలాష్ బహిరంగ క్షమాపణ చెప్పాలి..
- డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలి



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 20:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోమటిరెడ్డి సోదరులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమన్నారు. పార్టీ క్రమశిక్షణ గురించి మాట్లాడే ముందు కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడిగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలవకుండా పార్టీని ఎలా బలోపేతం చేస్తారని ప్రశ్నించారు. పున్న కైలాష్‌కు ఆ పదవిలో కొనసాగేందుకు నైతిక అర్హత లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, సుంక బోయిన నరసింహ, ఛత్రపతి, పలువురు సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# స్వర్గీయ చెరుకు సత్తయ్య గౌడ్ సేవలు చిరస్మరణీయం

- రెండవ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 20:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బలహీన వర్గాల ముద్దుబిడ్డ స్వర్గీయ చెరుకు సత్తయ్య గౌడ్ రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం చౌటుప్పల్‌లోని రాజీవ్ స్మారక భవన్‌లో ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోదుగుల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై సత్తయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్టీ మారకుండా, కాంగ్రెస్ జెండాను వదలకుండా జీవితాంతం పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన నిబద్ధతగల నాయకుడు చెరుకు సత్తయ్య గౌడ్ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామచందర్, మాజీ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, రాజీవ్ స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖయ్యూం, కార్యదర్శి నల్ల నరసింహ, 12వ వార్డు కౌన్సిలర్ పాక పద్మ చిరంజీవి, కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె. నవీబి జానీ, బొబ్బిలి రాజేందర్, పబ్బు శ్రీకాంత్ గౌడ్, షేక్ కరీం, చామకూర రాజయ్య, మహమ్మద్ ఎజాస్, మహమ్మద్ చాంద్ పాషా, ముత్యాల గణేష్ కుమార్, చెరుకు కృష్ణ గౌడ్, ఉడుగు నరసింహ గౌడ్, పోలోజు శ్రీనివాస్ చారి, బత్తుల రాజు, వర్కాల శివకుమార్ గౌడ్, దాకోజి అజయ్, మొగుదాల వెంకటేష్, నందగిరి సాయికుమార్ గౌడ్, చింటూ, వర్కాల రాము గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుర్కంటి బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభం

- చౌటుప్పల్ 9వ వార్డు శివాజీ నగర్‌లో పథకాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్,వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు







**తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 20:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శివాజీ నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి వార్డులో అర్హులైన కుటుంబాలన్నింటినీ బీమా పరిధిలోకి తీసుకురావాలని కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీమా నమోదుకు రేషన్ కార్డు, అందులోని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులతో సంబంధిత వార్డు ఇన్‌చార్జిని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు నమోదు అనంతరం జారీ చేసే గుర్తింపు సంఖ్యను భద్రపరచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, హన్ను మహమ్మద్, కో-ఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, షేక్ నవీబీ, జానీ బాబా, నాయకులు దేప రమ్య రాజు, సురుకంటి బాలకృష్ణారెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ. అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, వార్డు అధికారి రామ్ నారాయణమూర్తి, జవాన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. శివాజీ నగర్ కాలనీకి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పథకంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు


- డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత వ్యాఖ్యలను ఖండించిన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మెగావత్ రెడ్యా నాయక్



**తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్21:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెగావత్ రెడ్యా నాయక్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఉద్దేశించి డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత చేసిన రాజీనామా వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరడం తప్పా.మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం రోడ్లు,పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు,డిండి లిఫ్ట్ ఇరిగేషన్,చల్లగూడెం ప్రాజెక్టుతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరడం తప్పుగా కనిపిస్తోందా అని ప్రశ్నించారు.ఒక బీసీ బిడ్డగా,డీసీసీ అధ్యక్షుడిగా ప్రజా సమస్యలపై మీరు ఎంతవరకు పోరాటం చేశారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి సోదరులకు ఉన్న రాజకీయ దమ్ము,ధైర్యం మీకు ఉందా అని విమర్శించారు.డీసీసీ అధ్యక్ష పదవి కోసం గతంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని బతిమిలాడిన విషయాన్ని అప్పుడే మర్చిపోయారా అని నిలదీశారు.మైకు ఉంది కదా,నోరు ఉంది కదా అని ఇష్టానుసారంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై విమర్శలు చేస్తే మునుగోడు నియోజకవర్గ ప్రజలు,రాజన్న సైన్యం సహించబోదని హెచ్చరించారు.ఎమ్మెల్యేపై అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని,డీసీసీ అధ్యక్ష పదవికి తగిన విధంగా వ్యవహరించాలని హితవు పలికారు.ఇకనైనా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై తప్పుడు వ్యాఖ్యలు చేయకుండా పార్టీ క్రమశిక్షణకు లోబడి వినయ విధేయతలతో మెలగాలని మెగావత్ రెడ్యా నాయక్ సూచించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గుజ్జారి శ్రవణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలగొని మల్లేష్,ఎర్రోళ్ల లింగస్వామి,భాను కిరణ్ కుమార్,యువజన నాయకులు,తదితరులు,పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారం.. లింక్ నొక్కితే ఖాతా ఖాళీ

- మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20:** డ్రగ్స్, గంజాయికి బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందని, సైబర్ నేరగాళ్ల లింకులు నొక్కితే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని షాద్‌నగర్ పట్టణ సీఐ కె. సీతారాం హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని, తల్లిదండ్రుల కలలను వమ్ము చేయవద్దని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా మోజు వీడి చదువుపై దృష్టి పెట్టాలని, అమ్మాయిలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ బ్యాంకు సందేశాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నకిలీ లింక్ ద్వారా ఓ ఉపాధ్యాయురాలు రూ.2.90 లక్షలు, పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో మరో మహిళ రూ.4 లక్షలు కోల్పోయిన ఉదాహరణలను వివరించారు. తెలియని లింకులు, ఫైల్స్ తెరవవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపవద్దని, లైసెన్స్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సీఐ సీతారాం, ఎస్ఐ శ్రీకాంత్, షీ టీమ్, సైబర్ క్రైమ్ అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. గుంతలో దిగబడిన కారు!

**● వేణుగోపాలస్వామి వెంచర్‌లో ఆగని తాగునీటి వృథా**





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 20:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వేణుగోపాలస్వామి వెంచర్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. లీకవుతున్న నీరు నిరంతరం ప్రవహించడంతో రోజు నీరు నిలిచి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఈరోజు కాలనీ గుండా వెళ్తున్న ఒక కారు ఆ నీటి గుంతలో దిగబడి ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణాపాయం జరగకపోయినా, కారు పూర్తిగా బురదలో కూరుకుపోయింది.ఒకవైపు ప్రభుత్వం నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తుంటే, మరోవైపు మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వేలాది లీటర్ల తాగునీరు వృథా అవ్వడమే కాకుండా, వాహనదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. గతంలోనే ఈ సమస్యపై మున్సిపాలిటీ అధికారులను సంప్రదించినా "మాకు సంబంధం లేదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ తప్పించుకున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ మరియు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి, కోతకు గురైన రోడ్డును బాగు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ధీమా..
# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

**- 14వ వార్డులో బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**



**తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 20:** నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ అన్నారు.చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు సందగళ్ల విజయ సతీష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జ్యోతి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ. 5 లక్షల బీమా ప్రయోజనం అందించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ డైరెక్టర్ వర్కాల రవి, వార్డు ఇన్‌చార్జి బొంగు వెంకటేష్, ఊదరి స్వామినాధం, కామిశెట్టి చంద్రశేఖర్, వరగంటి శ్రీను, వరగంటి భాను, ఎస్.కె. మున్నా, చెరుకు రాజు, జిట్టగోని శ్రీను, తడకమళ్ల శ్రీనివాస్ గుప్త, చెన్నగోని శివ గౌడ్, అప్పిడి శేఖర్ రెడ్డి, ఊడుగు నవీన్ కుమార్, జోగ్రీగల ఆంజనేయులు, కొయ్యల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు
# ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి ఇవ్వాలి

**- డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉప్పు కృష్ణ డిమాండ్**

**తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 20:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించడంతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ఉప్పు కృష్ణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకరమ్మకు ఎమ్మెల్సీ ఎందుకు ఇవ్వలేదు? మంత్రి పదవి ఎందుకు కల్పించలేదు? అని పదేపదే ప్రశ్నించడం కంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆమెకు కేటాయించి, మంత్రివర్గంలోకి తీసుకోవాలని అన్నారు. తద్వారా తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడి కుటుంబానికి సముచిత గౌరవం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా భావించే సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబర్ 9వ తేదీనైనా అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఎమ్మెల్సీ పదవి కల్పించి, మంత్రి పదవి ఇచ్చి తెలంగాణ సమాజం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.అదేవిధంగా డిసెంబర్ 9న తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తామని ప్రకటించిన ఇంటి స్థలాల పట్టాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు నెలవారీ పింఛన్, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాల కల్పనపై స్పష్టమైన ప్రకటన చేసి, ఆ రోజే వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఉప్పు కృష్ణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.



# నేలపట్ల పద్మశాలి కాలనీలో
# లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

**- సర్పంచ్ వసంత నగేష్ గౌడ్ విజ్ఞప్తితో పది రోజుల్లోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు**



**తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 20:** చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని పద్మశాలి కాలనీవాసుల దీర్ఘకాలిక లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీలో గత కొంతకాలంగా విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ గౌడ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.సర్పంచ్ విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కేవలం పది రోజుల్లోనే కాలనీకి నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.దీంతో కాలనీవాసుల విద్యుత్ కష్టాలు తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ వసంత నగేష్ గౌడ్‌కు, వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సతీష్, మాజీ సర్పంచ్ గుండు మల్లయ్య, వార్డు సభ్యురాలు పాలమాకుల కవిత నర్సింగ్, మాజీ ఉపసర్పంచ్ పాలమాకుల యాదయ్య, గీత సంఘం అధ్యక్షుడు పబ్బతి వెంకటేష్, పాలమాకుల నరసింహ, వార్డు సభ్యులు చప్పిడి సంజీవరెడ్డి, గుర్రం ప్రమోద్ కుమార్, పబ్బు మహేష్, బాండ్లపల్లి రాజు, గుండు రాజు, జి. సురేష్, సీహెచ్ లింగస్వామి, పబ్బు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు

**- వివాహ వేడుకకు హాజరైన దొంతి మాధవరెడ్డి**





**తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడ్య తిరుమల్ సోదరుడు లావుడ్య బిక్షపతి చౌహాన్‌బుజ్జి దంపతుల కుమార్తె నిరోష వివాహం సుమన్‌తో జరిగింది. ఈ వేడుకకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు

**- వివాహ వేడుకకు హాజరైన దొంతి మాధవరెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ గొల్లపల్లికి చెందిన కంది నర్సింహారెడ్డిసంధ్య దంపతుల కుమారుడు అర్జున్‌రెడ్డి వివాహం శృతిరెడ్డితో జరిగింది. ఈ వేడుకకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు పెండం రామన్న, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

**- పేదలకు ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం: పెండ్యాల హరిప్రసాద్**



**తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 20:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని 7వ వార్డులో మోతే సునీతయాకూబ్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచన మేరకు కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. నెక్కొండ మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలోనూ అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత వైద్య శిబిరం

**- 43 పశువులకు వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**



**తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 20:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరుపల్లి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్, పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటరాజు శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులకు సెక్స్ సార్టెడ్ సీమెన్ విధానంపై అవగాహన కల్పించి, ప్రభుత్వ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో 43 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 35 పశువులకు ఎదకు సంబంధించిన పరీక్షలు, 21 దూడలకు నట్టల నివారణ మందులు, ఐదు పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అందించారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# వీరగోని రమేష్ గౌడ్‌కు నివాళులు

**● కుటుంబ సభ్యులకు పరామర్శ..**

**ఆర్థిక సాయం అందించిన పెండ్యాల హరిప్రసాద్**

**తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 20:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని 7వ వార్డుకు చెందిన వీరగోని రమేష్ గౌడ్ అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన పార్థివదేహానికి నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, డీసీసీ సభ్యుడు నేతుల సారంగపాణి యాదవ్, వార్డు సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి ఎన్నికల పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



తొలిఅక్షరం/నెల్లికుదురు నవంబర్ 20:మహబూబాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎన్నికల అవగాహన క్విజ్ మరియు వ్యాసరచన పోటీల్లో పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, నెల్లికుదురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఎస్. దీక్షిత్, అమృతవర్షిణి నాలుగవ స్థానం, అలాగే వ్యాసరచన పోటీల్లో పి. సిరివెన్నెల ఆరవ స్థానం సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జి. ఉపేందర్ రావు విద్యార్థులను అభినందించారు. పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ పి. నవీన్ కుమార్ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీల్లో చురుకుగా పాల్గొని ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు.

# విజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి...

**• జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 20: విజ్ఞానాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ 59వ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముగింపు వేడుకలు, బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాలతో నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు, నిరుద్యోగులకు, గ్రంథాలయాలతో ఎంతో బంగారు భవిష్యత్తు అని అన్నారు. గ్రంథాలయాలలో అధ్యాయానికి నిత్యం కొంత సమయం కేటాయించి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని, విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.విద్యార్థిని, విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించి ఉన్నంత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు మనిషి విజ్ఞానానికి జీవన మనగడకు కేంద్రాలని ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.సగటు మనిషి కొనుగోలు చేయలేని విలువైన గ్రంథాలు, గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థి దశల్లో పాఠ్యపుస్తకాలకు పరిమితమవుతున్నామని ,పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇతర పుస్తకాలు, చదవడం ద్వారా జ్ఞానం సమూపార్జించుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, లైబ్రేరియన్స్ జి .విజేందర్, రుద్రారపు వీరేందర్, సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి. బి. యాదమ్మ, సీనియర్ నాయకులు నర్సింగా శ్రీనివాస్, సీనియర్ పాఠకుడు, పుస్తక ప్రియుడు అబ్బ గాని భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు రాచకొండ ఉపేందర్, గాడిపల్లి ప్రవీణ్,జి. అనూజ ,ప్రవీణ్, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు గైర్హాజరైన నలుగురు వైద్యుల సస్పెన్షన్

**• మధిర ఆసుపత్రిలో సమయపాలన పాటించకపోవడంతో చర్యలు: డాక్టర్ రాజశేఖర్ గౌడ్**

తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్ -20: విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడంతో మధిర ఏరియా ఆసుపత్రికి చెందిన నలుగురు వైద్యులను సస్పెండ్ చేసినట్లు జిల్లా కేంద్ర ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ తెలిపారు.ఈ నెల 19న నిర్వహించిన సమావేశంలో వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ, నవంబర్ 20న నిర్దేశిత సమయానికి విధులకు రాకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీఏ నిబంధనల ప్రకారం డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ డి. శ్రీను, డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, డాక్టర్ పి. శ్రీకాంత్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సస్పెన్షన్ కాలంలో వారి ప్రధాన కార్యాలయాన్ని ఖమ్మంగా నిర్ణయించామని, అనుమతి లేకుండా అక్కడి నుంచి వెళ్లరాదని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డాక్టర్ రాజశేఖర్ గౌడ్ హెచ్చరించారు.

# మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

**- డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి: జూనియర్ సివిల్ జడ్జి గౌస్ పాషా**




తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 20: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి గౌస్ పాషా సూచించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి గౌస్ పాషా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు వడ్డించే ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్, చౌటుప్పల్ ఎస్ఐ అజయ్ భార్గవ్, జాయింట్ సెక్రటరీ మక్తాల నరసింహ, సభ్యుడు ఖయ్యూం పాషా, సీనియర్ న్యాయవాదులు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలమోని శ్రీనివాస్, తడక మోహన్, జెల్లా రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డీఎల్ఎస్ఏ సభ్యుడు మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లోని ఆదర్శనగర్‌లో ఉన్న సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలి



తొలి అక్షరం,జవహర్ నగర్/ నవంబర్ 20: కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్ జవహర్ నగర్ లోని ఆదర్శ్ నగర్ కాలనీ వాసుల ఇండ్ల మధ్యలో నిర్మిస్తున్న ఎయిర్టెల్ సెల్ టవర్ ని ఎత్తివేయడం కోసం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ గారికి కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది. కాలనీ ప్రజలు ఇప్పటికే డంపింగ్ యార్డ్ వాసనతో సతమతమవుతున్న మాకు మా ఇండ్ల మధ్యలో ఈ సెల్ టవర్ పెట్టడం వల్ల రేడియేషన్ ప్రభావంతో చిన్న పిల్లలకు వృద్ధులకు అపాయం జరుగుతుందని ఈ ఎయిర్టెల్ సెల్ టవర్ ని ఇక్కడ నుంచి తరలించాలని ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్వాహకులను అడ్డుకోవడం జరిగింది కానీ వాళ్లు మా మాటలు పెడచెవిన పెట్టి పనులు చేయడం వల్ల గొడవ జరిగి ఆడవాళ్ళు అని చూడకుండా ఆ ఫ్లాట్ ఓనర్ ప్రభాకర్ పంతులు మరియు అతని కొడుకు ఆడవాళ్లపై చేయి చేసుకోవడం వల్ల పోలీస్ స్టేషన్ కేసు కూడా పెట్టడం జరిగింది ఎయిర్టెల్ సెల్ టవర్ ని వెంటనే ఇక్కడ నుంచి ఎత్తివేయాలని కాలనీ వాసులందరూ కలిసి కలెక్టర్ కార్యాలయంలో డిప్టిక్ రెవెన్యూ ఆఫీసర్ ఎస్ మాలతి మేడం గారిని కలిసి ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ప్రాణాపాయం ఉన్నందున ప్రజలమనోభావాలు అర్థం చేసుకొని దయచేసి ఇక్కడి నుండి ఎత్తివేయాలని అధికారికంగా ఆదేశాలు ఇవ్వాలని కాలనీ ప్రజలు కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఇట్టి విషయాన్ని డిఆర్ఓ మేడం గారు అధికారులకు ఈ సమాచారాన్ని అందిస్తానని హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వై మల్లేష్, సిహెచ్ దశరథ్ గారు, ఉపాధ్యక్షులు పి. కిరణ్, కిషోర్, రాజు, రమేష్, విలాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షులు వై మల్లేష్, సిహెచ్ దశరథ్ గారు, ఉపాధ్యక్షులు పి కిరణ్, కిషోర్, రాజు, రమేష్, విలాస్, జే భాను శ్రీ,, బాల మురళి, వి లతా, ఆర్ సంధ్యారాణి, కాలనీ లో ఉన్న ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత నాదే

**ప్రజా ప్రయోజనాలకే ప్రభుత్వ భూముల వినియోగం... శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్**



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 20: ప్రభుత్వ భూముల పరిరక్షణ తనదేనని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని జంగిలిగొండ గ్రామంలోని ప్రభుత్వ భూములను అక్రమ ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించే బాధ్యత తనదేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ హామీ ఇచ్చారు.శుక్రవారం మండలంలోని జంగిలిగొండ గ్రామంలో పైలట్ కార్యక్రమంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని శాసనసభ్యులు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుండెల రేణుక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు వెల్లడించారు. ఈ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా గ్రామ ప్రజల ఉమ్మడి అవసరాలకు వినియోగించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు హామీ** జంగిలిగొండ గ్రామ ప్రజలకు మల్యాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దూరంగా ఉండటంతో వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని జంగిలిగొండ గ్రామంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామంలోని ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.**ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉద్దేశించినదని ఎమ్మెల్యే వివరించారు. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి రూ. 5 లక్షల బీమా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.రేషన్ కార్డు ఉన్నవారితో పాటు రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకొని ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ముఖ్యంగా సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.**12 మంది లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు** అనంతరం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో భాగంగా గ్రామానికి చెందిన 12 మంది లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించి, అర్హులందరూ నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పురుషోత్తం, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల చీఫ్ అడ్వైజర్ దేవరం ప్రకాశ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గుండెల రేణుక, ఉపసర్పంచ్ కొయ్యల అనిల్, వార్డు సభ్యుడు బోయిని వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి గూగులోత్ రాములు, శశి, సుమలత, వీవో అధ్యక్షురాలు గోల్కొండ శ్రీదేవి, సీఏ గోల్కొండ స్రవంతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## చలో మేడారం మహా పాదయాత్రను

# విజయవంతం చేయండి

**- ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న**




తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 20: ఈనెల 22 ఆదివారం ఉదయం 11 గంటలకు మేడారంలో నీ జంపన్న వాగు నుండి సమ్మక్క సారక్క గద్దెల వరకు జరుగు మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వము ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని ములుగు జిల్లా మేడారంలో జరగబోయే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుండి 33 జిల్లాల ఉద్యమకారులు ఉద్యమకారునీలు పాల్గొని విజయవంతం చేయాలని జోగు అంజన్న ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

# ఘనంగా రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలు ప్రారంభం

**క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి: మంత్రి వాకిటి శ్రీహరి**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మైదానంలో 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) హాకీ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. పది జిల్లాలకు చెందిన విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. క్రీడలను కాలక్షేపంగా కాకుండా జీవిత లక్ష్యంగా భావించి అంకితభావంతో సాధన చేయాలని సూచించారు. ప్రతిభ, పట్టుదల, నిరంతర సాధనే విజయానికి పునాదులని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో ముఖ్యమని, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు.కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ బాలికలు క్రీడల్లో మరింతగా రాణించాలని, వరంగల్‌లో క్రీడా పాఠశాల, స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి క్రీడలను విద్యలో అంతర్భాగంగా గుర్తించి రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్, కంప్యూటర్ ఆటలకు దూరంగా ఉంటూ మైదాన క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026 నిర్వహించనున్నట్లు, ఈ పోటీల్లో సుమారు 7 వేల మంది క్రీడాకారులు, 2 వేల మంది సహాయక సిబ్బంది పాల్గొననున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026 గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర యువజన అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# సుస్మిత మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

**- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలి: స్కైలాబ్ బాబు**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 20:** దళిత విద్యార్థిని సుస్మిత మృతిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నడివాడ గ్రామంలో సుస్మిత తల్లిదండ్రులు సుకన్య, కుమారస్వామిలను పరామర్శించి ఘటన వివరాలు తెలుసుకున్నారు. 18 పేజీల లేఖలో సుస్మిత తనపై జరిగిన వేధింపులు, అవమానాలను వివరించిందని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో 11 మందిని పేర్కొనగా ఆరుగురినే అరెస్టు చేశారని, గ్రామ సర్పంచ్ విజయ్‌తో పాటు మరో నలుగురిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు.సుస్మిత కుటుంబానికి ఐదు ఎకరాల భూమి, రూ.50 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు, తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 48 గంటల్లో మిగిలిన నిందితులను అరెస్టు చేయకపోతే డీజీపీకి ఫిర్యాదు చేసి జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ పరామర్శలో కేవీపీఎస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్‌ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**జేఎన్ఎస్ స్టేడియంలో అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** డిసెంబర్ 18 నుంచి 21 వరకు స్టేడియంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి, ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అభివృద్ధి పనులను రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమ అభివృద్ధి,మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు.వచ్చే నెల 18 నుండి 21 తేదీ వరకూ 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్ లో అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తుండగా స్టేడియంలో చేస్తున్న క్రీడలు,క్రీడాకారుల కోసం కల్పిస్తున్న మౌలిక వసతుల ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి,స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఛైర్మన్ శివసేనారెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత,తదితరులు పరిశీలించారు.జిమ్నాస్టిక్స్ ఇండోర్ హాలులో క్రీడాకారులు జిమ్నాస్టిక్స్ చేయగా మంత్రి వాకిటి శ్రీహరి,తదితరులు వీక్షించారు.క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో మాట్లాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న దృష్ట్యా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్న దృష్ట్యా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వరరావు,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న,ఖేలో ఇండియా నోడల్ అధికారి పవన్,ఆర్ అండ్ బి ఈఈ దేవిక చౌహన్,జిల్లా యువజన,క్రీడల అధికారి ప్రశాంత్,ఇతర అధికారులు,క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా వాకథాన్

**● కళాజాత ద్వారా బాలల హక్కులపై అవగాహన**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా మహిళలు పిల్లలు దివ్యాంగులు,వయో వృద్ధుల శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో వాకథాన్ కార్యక్రమం పోలీస్ కమిషనరేట్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించారు.యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్,ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ,డాన్ బాస్కో నవజీవన్,షేర్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నిర్వహించగా జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్ ఇన్స్పెక్టర్ రమేష్,బాలల న్యాయ మండలి సభ్యురాలు డాక్టర్ గోపికా రాణి,కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కే అనితా రెడ్డి జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు.వాకథాన్ అనంతరం... కళాజాత బృందం ఆధ్వర్యంలో బాలల హక్కులు,బాల్యవివాహాల నిర్మూలన,మానవ అక్రమ రవాణా నివారణ చర్యలు పై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి...జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ...బాలల హక్కుల ప్రాముఖ్యతపై వివరించారు.బాలల హక్కుల వొడంబడికలో హక్కులున్నాయని అందులో ప్రధానంగా జీవించే హక్కు,రక్షణ పొందే హక్కు,అభివృద్ధి చెందే హక్కు,పాల్గొనే హక్కులున్నాయని...బాలల హక్కులకు భంగం కలుగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని అన్నారు.నా రోజు నా హక్కులు,నా భవిష్యత్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా వారి భవిష్యత్ జీవితం నిర్దేశించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం బెలూన్లను పిల్లలతో కలిసి ఎగురవేసి,సిగ్నేచర్ క్యాంపెయిన్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ,బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సి హెచ్ అవంతి,సిస్టర్ సహాయ,ఫాదర్ కోషి,కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కే అనితా రెడ్డి,ఎర్ర శ్రీకాంత్,బత్తుల కరుణ,ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్,జేజేబి మెంబర్ డాక్టర్ గోపికా రాణి,సిడిపివో లు,ఐసీడీఎస్ సూపర్వైజర్,అంగన్వాడి టీచర్లు,ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉన్నత శిఖరాలు.. విద్యార్థులకు ఎమ్మెల్యే శంకర్ పిలుపు

**విద్యార్థుల ప్రతిభకు గ్రంథాలయ వేదిక.. విజేతలకు ఘన సత్కారం**

**విజ్ఞాన వెలుగులు పంచిన 59వ గ్రంథాలయ వారోత్సవాలు.. ఘనంగా ముగింపు వేడుకలు**







**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 59వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారం రోజులపాటు నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా తాలూకాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు చదరంగం, పీస్ ఫొటోగ్రఫీ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని, దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని, గ్రంథాలయాల్లోని విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు నక్క బాలరాజ్ యాదవ్, సి. వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాసులు, మీడియా ఆర్గనైజర్ అల్వాల దర్శన్ గౌడ్, జాయింట్ సెక్రటరీ జూపల్లి చంద్రశేఖర్, కోశాధికారి నీళ్ల రవీందర్ గౌడ్, సంయుక్త కోశాధికారి కత్తి చంద్రశేఖర్ అప్ప, చదరంగం మాస్టర్ వానరసి జగన్, కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, గ్రంథాలయ పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా భరోసా

**● వెల్జర్లలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20:** పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామంలో సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో తొలిసారిగా వెల్జర్లలో ఈ పథకం అమలులోకి వచ్చింది.ఈ సందర్భంగా అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు నివాళులర్పించి, గొర్ల వెంకటయ్య ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా బీమా సాయం అండగా నిలుస్తుందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లు, చీరలు, సామాజిక పెన్షన్లతో పాటు పేదలు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలికట్టకు భారీగా చేయూత పెన్షన్లు

**- సర్పంచ్ విజ్ఞప్తితో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20: షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఎలికట్ట గ్రామానికి పెద్ద సంఖ్యలో కొత్త చేయూత పెన్షన్లు మంజూరయ్యాయి. వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులకు పెన్షన్లు మంజూరు కావడంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది.గ్రామంలో పెన్షన్లకు అర్హులైన వారు ఉన్నప్పటికీ మంజూరు కాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పెద్ద సంఖ్యలో పెన్షన్లు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదల సమస్యపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి అండగా నిలవడం సంతోషకరమన్నారు. పెన్షన్లు మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

**- అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం: చంద్రశేఖర్**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20: అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లేడు చౌదరిగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా ఈ పథకం భరోసా కల్పిస్తుందని తెలిపారు.అర్హతలు, దరఖాస్తు విధానం, నిబంధనలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎంపీడీవో, తహసీల్దార్, మండల ప్రత్యేక అధికారి, ఎంపీవో హన్మంతరెడ్డి, సర్పంచ్ శ్వేత చంద్రబాబు, ఉపసర్పంచ్ అజ్జు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ..

## అందె మోహన్ సంచలన వ్యాఖ్యలు!

- అధికారంలో ఉన్నా కార్యకర్తలకు అన్యాయమేనా?.. వైస్ చైర్మన్ ఆవేదన
- వలస నేతలకు పదవులు.. అసలైన కార్యకర్తలకు పోలీసు కేసులా?




తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 20: అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరగడం లేదంటూ షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ చేసిన వ్యాఖ్యలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జరిగిన పట్టణ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి పార్టీ కోసం పోరాడిన నిజమైన కార్యకర్తలకు నేటికీ పోలీసు కేసులు, వేధింపులు తప్పడం లేదని అందె మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చినా కార్యకర్తల పరిస్థితి మారకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల పార్టీలో చేరిన వలస నేతలు కోట్లాది రూపాయలు సంపాదించుకుంటూ అధికారాన్ని అనుభవిస్తుంటే, ఏళ్లుగా జెండా మోసిన కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.నాయకులు ఏసీ గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల సమస్యలను గుర్తించాలని సూచించారు. నియోజకవర్గంలో సుమారు 80 మంది కార్యకర్తలు తనను కలిసి సమస్యలు చెప్పుకున్నారని వెల్లడించారు. అంతర్గత సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పార్టీకి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలు షాద్‌నగర్ కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి.

## ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# అవార్డుల ప్రదానోత్సవం

- విశిష్ట ప్రతిభావంతులకు నంది,సింహ పురస్కారాలు
- ఈ నెలా 30 లోపు దరఖాస్తుల ఆహ్వానం




తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్20: ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్-తెలంగాణ (రిజిస్ట్రేషన్ నెం. 600/2022) ఆధ్వర్యంలో సినీ గాన విభావరితో పాటు, ప్రముఖ సినీ నటులు పద్మవిభూషణ్ రజనీకాంత్, విక్టరీ వెంకటేష్‌ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్, వెంకటేష్ ఫిలిమ్,సోషల్ ఎక్సలెన్స్, టాలెంట్ ఐకాన్ అవార్డులు-2026 నంది అవార్డు, సింహ అవార్డుల ప్రదానోత్సవానికి అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.సాహిత్యం, గానం, కళలు, సేవారంగాలలో విశిష్ట కృషి చేసిన ప్రతిభావంతులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ 12న ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని వాసవి శ్రీముఖి కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో గల ఎస్.ఎం.ఈ గ్రాండ్ స్టూడియో బాంక్వెట్ హాల్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి.ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు ఇంటిపేరు, పూర్తి పేరు, గ్రామం/పట్టణం, పూర్తి చిరునామా మరియు తమ రంగంలో ఉన్న అనుభవం వివరాలను ఈ నెల 30వ తేదీ లోపు ఈవెంట్ ఆర్గనైజర్ వాట్సాప్ నంబర్ 9494861669 కు పంపి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## పోలీసింగ్‌కు కొత్త దిశ..భవిష్యత్ ప్రణాళికలపై

# డీజీపీ దిశానిర్దేశం

- మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- 2 వేల హోంగార్డుల నియామక ప్రకటనపై సమీక్ష





తొలి అక్షరం రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్ 20: రాష్ట్ర పోలీస్ శాఖలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలు, సిబ్బంది సంక్షేమంపై డిజిపి సి.వి.ఆనంద్ శుక్రవారం మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు.వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ రిట్రీట్, మహిళా పోలీస్ అధికారుల సదస్సు, నూతన తెలంగాణ పోలీస్ మాన్యువల్ రూపకల్పన పూర్తి చేసి విడుదల చేయడం, పోలీస్ బ్రాస్, పైప్ బ్యాండ్లను పునరుద్ధరించడం వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహణ, ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణపైనా సమీక్షించారు.రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించి వార్షిక శిక్షణ క్యాలెండర్ సిద్ధం చేయడం, 2,000 మంది హోంగార్డుల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్, ఇతర వివరాలు, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖ మంజూరైన సిబ్బంది సంఖ్యను పునఃసమీక్షించడం వంటి అంశాలను పరిశీలించారు.రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశానికి సంబంధించి అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించడంతో పాటు, పనుల పూర్తికి గడువులు కూడా నిర్ణయించారు. నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిజిపి సి.వి. ఆనంద్‌తో పాటు డిజి విమెన్ సేఫ్టీ వింగ్ డా. సౌమ్య మిశ్రా, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్తు, డిజి,ఎసిబి & సిఐడి చారు సిన్హా, టీజీఎస్పీ ఎడిజి సంజయ్ కుమార్ జైన్, ఎడిజి (లా అండ్ ఆర్డర్) డా. అకున్ సబర్వాల్, ఐజి, పి&ఎల్ డా. గజరావ్ భూపాల్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 2వేలకు పైగా కొలువులతో నేడు 'మెగా జాబ్ మేళా'

- నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే లక్ష్యం
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి
- యువత ముంగిటకే 20కి పైగా దిగ్గజ కంపెనీలు
- జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్




తొలి అక్షరం/పెద్దపల్లి,నవంబర్ 20 : ఉద్యోగ అన్వేషణ కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లే పనిలేకుండా,స్థానిక యువత ముంగిటకే దిగ్గజ కంపెనీలను తీసుకువస్తున్నామని పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో,ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను శుక్రవారం కళాశాల సిబ్బందితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తూ,నిరుద్యోగులకు ఉపాధి కల్పించడాన్ని ట్రినిటీ విద్యాసంస్థలు ఒక సామాజిక బాధ్యతగా తీసుకున్నాయని అభినందించారు. పెద్దపల్లి నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారిగా 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీలు ఒకే వేదికపైకి వచ్చి, 2 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించడం విశేషమన్నారు.గతంలో దాసరి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ ప్రత్యేక కోచింగ్ ఇప్పించి, దాదాపు 3 వేల మంది యువతకు ఆర్మీ,ఇతర రక్షణ దళాల్లో ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశారని గుర్తుచేశారు.ఉద్యోగం అంటే కేవలం వ్యక్తిగత ఉపాధి మాత్రమే కాదని,ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా అని ఆమె అన్నారు.యువత తమ భవిష్యత్తు కోసం ఒక్క ముందడుగు వేస్తే, వారికి అండగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలకు హాజరై విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఇంతటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి,చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.**నేడే మెగా జాబ్ మేళా** పెద్దపల్లి ప్రగతి నగర్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం (నవంబర్ 21) ఉదయం 9 గంటల నుండి మెగా జాబ్ మేళా ప్రారంభమవుతుంది.అండర్ గ్రాడ్యుయేట్లు,గ్రాడ్యుయేట్లు,పోస్ట్ గ్రాడ్యుయేట్లుతదితర అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా మరియు సర్టిఫికెట్లతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్,ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్,అడ్మిన్ ఆఫీసర్ సురేష్,రాజిరెడ్డి,చొప్పరి వంశీ, ప్రభాకర్,డాక్టర్ ఆరిఫ్,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భవిత,స్వాతి, అశోక్,లక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# విజయ్ సేతుపతి రూట్లో నస్లెన్

'ప్రేమలు'లో అమాయకమైన లవర్ బాయ్‌గా కనిపించిన నస్లెన్ ఇప్పుడు సూర్యకే విలన్‌గా మారిపోయారు. 'సీన్' సినిమాలో ఈశ్వరన్ పాత్రతో తనలోని మరో యాంగిల్ చూపించారు. అంతకుముందు 'లోకా'లో కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి నటించారు. ఇప్పుడు 'బ్యాచిలర్ పార్టీ డ్యూక్స్'లోనూ పెద్ద తారాగణంతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. హీరోగా మంచి క్రేజ్ వచ్చినా సోలో సినిమాల కోసమే ఎదురుచూడకుండా ఇలా విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్న తీరు చూస్తుంటే విజయ్ సేతుపతి గుర్తుకొస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా తన కెరీర్‌లో హీరో పాత్రలకే పరిమితం కాలేదు. '96'లో ప్రేమికుడిగా మెప్పించిన ఆయన 'విక్రమ్ వేద', 'మాస్టర్', 'విక్రమ్', 'జవాన్' సినిమాల్లో నెగెటివ్ పాత్రలతో అదరగొట్టారు. మరోవైపు 'మహారాజ'తో సోలో హీరోగానూ భారీ విజయం అందుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. పాత్ర నచ్చితే తన ఇమేజ్ గురించి పెద్దగా పట్టించుకోకుండా సినిమాలు చేయడం సేతుపతికి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు నస్లెన్ కూడా దాదాపు అలాంటి రూట్‌లోనే వెళ్తున్నారు. 'ప్రేమలు'తో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించిన తర్వాత వరుస ప్రేమకథలు చేసే అవకాశం ఉన్నా, సూర్య 'సీన్'లో సైకో కిల్లర్ పాత్రకు ఓకే చెప్పారు. దర్శకుడు జీతూ మాధవన్ కూడా నస్లెన్ లాంటి యంగ్ హీరో ఈ పాత్రకు అంగీకరిస్తారా అని మొదట అనుకున్నారట. కానీ నస్లెన్ తన కొత్త ఇమేజ్‌ను వదిలి ఇంత డార్క్ క్యారెక్టర్ చేయడం విశేషం. అయితే విజయ్ సేతుపతి జర్నీలో నస్లెన్ నేర్చుకోవాల్సిన మరో విషయం కూడా ఉంది. ఒక దశలో సేతుపతికి విలన్ ఆఫర్లు ఎక్కువయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో తన సన్నివేశాలు ఎడిటింగ్‌లో తగ్గిపోయిన సందర్భాలున్నాయని కూడా చెప్పారు. దీంతో కొంతకాలం విలన్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నస్లెన్ కూడా వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తే, హీరోగా సంపాదించుకున్న గుర్తింపు కంటే నెగెటివ్ క్యారెక్టర్లకే డిమాండ్ పెరిగే ఛాన్స్ ఉంది.

# పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..






ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత 2026 జూన్‌లో తాను గర్భవతినన్న విషయాన్ని వెల్లడించిన సమంత, 'మా ఇంటి బంగారం' చిత్రం అనంతరం ప్రసవం కోసం నటన నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు బాబు రాకతో ఆ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

# ఆకలేస్తే చిరంజీవి గారి ఇంటికెళ్లి భోజనం చేసేవాడిని

## : నాజర్ భావోద్వేగం



సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నాజర్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు, ఆ తర్వాత అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో ఎన్నో ఆకలి రోజులను చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం తనకు అందించిన మద్దతును ఆయన ఎంతో భావోద్వేగంతో పంచుకున్నారు.అవకాశాల కోసం చెన్నైలో ఎదురుచూస్తున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఎదురయ్యాయని నాజర్ వెల్లడించారు. అలాంటి సమయాల్లో తాను చిరంజీవి ఇంటికి వెళ్లి భోజనం చేసేవాడ్నని తెలిపారు. అప్పట్లో చిరంజీవి వరుస షూటింగులతో బిజీగా ఉండేవారని, తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, ఇంట్లో భోజనం ఉందో లేదో తెలుసుకునేవాడ్నని వివరించారు. భోజనం అందుబాటులో ఉందని తెలియగానే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడ్నని చెప్పారు. ఒక్కోసారి తాను వెళ్లి భోజనం చేసి వచ్చిన విషయం చిరంజీవికి తెలిసేది కాదని, ఆయన షూటింగులో ఎక్కడో ఉండేవారని తెలిపారు. వారి కుటుంబం తనకు చేసిన ఆ సాయం వెలకట్టలేనిదని నాజర్ పేర్కొన్నారు.నటన వైపు అడుగులు వేయడంలో తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని నాజర్ తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి సినీ రంగంలోకి వెళ్లమని తండ్రే సూచించారని చెప్పారు. ఆ తర్వాత చెన్నై చేరుకుని ఓ చిన్న ఉద్యోగంలో చేరారు. యాక్టింగ్ స్కూల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో, ఆఫీస్ సమయం ముగిసిన తర్వాత అదనంగా చిన్న చిన్న పనులు చేస్తూ డబ్బు ఆదా చేసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఒక నటుడిగా నిలదొక్కుకోవడానికి తనకు దాదాపు 15 ఏళ్ల సమయం పట్టిందని ఆయన వివరించారు.ఇక తెలుగు చిత్రపరిశ్రమలో తన అరంగేట్రం గురించి మాట్లాడుతూ.. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన 'చంటి' సినిమాతో తాను టాలీవుడ్‌కు పరిచయమయ్యానని తెలిపారు. ఆ సమయంలో తనకు తెలుగు భాష అస్సలు రాదని, కానీ స్టార్ హీరో అయినప్పటికీ వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను వివరించి, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునేలా ప్రోత్సహించారని చెప్పారు.కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం.. అలాగే వెంకటేశ్ అందించిన సహకారం తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ మరచిపోలేనివని నాజర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఎటువంటి గుర్తింపును ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని ఆయన అన్నారు.

# తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నాం?



సమాజంలో ఎక్కడైనా చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల ఘటన జరిగినప్పుడు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆవేదన వ్యక్తం చేస్తాం. కానీ ఆ వార్త పాతబడగానే మళ్లీ ఎప్పటిలాగే మౌనంలోకి జారిపోతామన్నది అంతే నిజం. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరిగే ఇలాంటి అఘాయిత్యాలను అరికట్టే బాధ్యత పిల్లలది కాదని.. పూర్తిగా పెద్దలదేనని కుండబద్దలు కొట్టారు. 2018 నుంచి -అర్పణ్- అనే స్వచ్ఛంద సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న విద్యాబాలన్.. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా సమాజంలోని లోపాలను ఎత్తి చూపారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరూ పట్టుబడరనే ధీమాతోనే రెచ్చిపోతున్నారని విద్యాబాలన్ అభిప్రాయపడ్డారు. పిల్లల మౌనం.. కుటుంబ పరువు పోతుందనే పెద్దల భయం.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సమాజం వెనుకాడే ధోరణే నేరగాళ్లకు కొండంత అండగా మారుతుందన్నారు. కఠినమైన అడుగులు వేయాల్సిన చోట పెద్దలంతా ఆగిపోతున్నారని.. మనకు ఎంతో నమ్మకమైన.. తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నామని విద్య సూటిగా ప్రశ్నించారు. సొంత కుటుంబంలోనే కొన్ని కఠినమైన హద్దులు గీయడం.. ఒక చిన్నారి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినప్పుడు దాన్ని గుడ్డిగా కొట్టిపారేయకుండా నమ్మడం పెద్దల కనీస బాధ్యత అని విద్యాబాలన్ గుర్తు చేశారు. ఇంటి పరువు బజారున పడుతుందనే భయంతో నిజాన్ని నాలుగు గోడల మధ్యే సమాధి చేయడం వల్ల నేరగాళ్లకు మరింత బలం చేకూరుతుందని హెచ్చరించారు. పోక్సో చట్టం ఎంత కఠినంగా ఉందో? ప్రజల్లోకి తీసుకెళ్లి నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. గతంలో తాను నటించిన -కహానీ 2- సినిమాలో దుర్గా రాణి పాత్ర చేస్తున్నప్పుడే బాలల వేధింపుల వెనుక ఉన్న చేదు నిజాలు.. బాధితులపై జీవితాంతం ఉండే మానసిక గాయాల గురించి లోతుగా అర్థమైందని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా విడుదలైన తర్వాతే ఇన్నాళ్లూ కార్పెట్ కింద దాచిపెట్టిన ఈ సున్నితమైన అంశంపై ఇళ్లలో చర్చ మొదలైందన్నారు. అయితే ఇలాంటి కథలను తెరకెక్కించేటప్పుడు దర్శక,నిర్మాతలు బాధితులను తప్పుపట్టకుండా.. సంచలనాల కోసం కాకుండా ఎంతో బాధ్యతగా చూపించాలని సూచించారు.కవలం సినిమాలు తీయడం వల్లనో? సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్లో? చిన్నారులకు రక్షణ దక్కదని విద్యాబాలన్ తేల్చి చెప్పారు. సినిమాలు కేవలం ఒక చర్చను మాత్రమే మొదలుపెట్టగలవని ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలవడం.. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. ఇటీవలే విద్యాబాలన్ -జైలర్ 2- లో కాంత పాత్రతో ఎలా అలరించారో తెలిసిందే. కల్పిక్ ఫ్యామిలీ వారసురాలిగా విద్య ఓ రేంజ్ లో అదరగొట్టారు. ప్రస్తుతం విద్య బాలన్ నటిస్తోన్న మరో మూడు బాలీవుడ్ చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

# 'ఆయనతో ఒక్క ఫోటో చాలనుకున్నా..

ప్రముఖ నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఓం' చిత్రంతో ఆమె నటిగా పునరాగమనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఈ అవకాశం ఎలా వచ్చింది, తన ఆరోగ్య రహస్యం ఏంటి అనే విషయాలపై ఆసక్తికరమైన వివరాలు పంచుకున్నారు.మమ్ముట్టి లాంటి గొప్ప నటుడితో కలిసి నటించే అవకాశం రావడం తనను ఆశ్చర్యపరిచిందని రేణూ దేశాయ్ అన్నారు. "గతేడాది ఆయన సినిమాలు చూస్తూ, ఎప్పటికైనా ఆయన్ను కలిసి ఒక ఫొటో దిగితే చాలనుకున్నాను. కానీ ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు" అని తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను కామాఖ్య దేవాలయంలో ఉన్నప్పుడు చెన్నై నుంచి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేసి మమ్ముట్టి సినిమాలో భార్య పాత్రకు ఆఫర్ చేశారని చెప్పారు. మొదట దాన్ని ఒక ప్రాంక్ కాల్ అనుకుని నమ్మలేకపోయానని ఆమె గుర్తుచేసుకున్నారు. రెండు నెలల తర్వాత చిత్రానికి 'ఓం' అని పేరు ప్రకటించగానే తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ఇదంతా దైవ సంకల్పమేనని భావిస్తున్నానని అన్నారు.గత ఏడాది తనకు ఒక సర్జరీ జరిగిందని, దానివల్ల దాదాపు ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో కిచిడీ, పెసరపప్పు, సొరకాయ వంటి తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకున్నానని చెప్పారు. ఈ ఆహార నియమాలు, విశ్రాంతి వల్లే శరీరంలో వాపు తగ్గి ఇప్పుడు మరింత ఫ్రెష్‌గా కనిపిస్తున్నానని తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించే తనకు భిన్నంగా, ఓ నటిగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.



# బన్నీ రేసులో బోయపాటి నెంబర్ - 4!



-పుష్ప- విజయంతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను శాసిస్తున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయం లో పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బన్నీ చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టుల జాబితా చూస్తే? అసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. అందులో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను స్థానం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తదుపరి సినిమాల రేసులో బోయపాటి ప్రాజెక్ట్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ ఫోకస్ అంతా తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రాకా- పైనే పెట్టారు. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరు గుతోంది. గతంలో ఇద్దరి కాంబినేషన్‌లో రిలీజ్ అయిన -సరైనోడు- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో బన్నీ కోసం బోయపాటి పవర్‌ఫుల్ మైథలాజికల్ టచ్ ఉన్న కథను సిద్ధం చేస్తున్నారని.. అది బన్నీకి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.అయితే ఏ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందన్నది అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. లోకేష్ ప్రాజెక్ట్ మాత్రం వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా లోకేష్ వేగంగానే పూర్తి చేస్తారు. ఈ విషయంలో లోకేష్ పెద్దగా సమయం తీసుకోరు. చిత్రీకరణ ముగించే విషయంలో లోకేష్ -లియో- స్ట్రాటజీ అనుసరిస్తారని చిత్ర వర్గాల నుంచి తెలుస్తోంది. ఎలా చూసుకున్నా? బోయపాటి ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే? ఎలా లేదన్నా రెండున్నరేళ్లకు పైగా సమయం పడుతుంది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.